ఎమ్మెల్సీ కవితను కలిసిన బీఆర్ఎస్ నేత

కేశంపేట, ఫిబ్రవరి 23: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను కేశంపేట మండలం వేములనర్వ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త మహేశ్ హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ఆశీస్సులు తీసుకున్నట్లు తెలిపారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

బీఆర్ఎస్ రంగారెడ్డిజిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

కంటివైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 23 : గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని రంగారెడ్డిజిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఎలిమినేడు గ్రామంలో ఆదివారం ఇబ్రహీంపట్నం మాజీ ఎంపీపీ మంచిరెడ్డి వెంకటప్రతాప్‌రెడ్డి సహకారంతో నాయిని వెంకటేశ్వర్‌రెడ్డి ఫౌండేషన్ ప్రత్యేక చొరవతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని మంచిరెడ్డి కిషన్ రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం మాజీ ఎంపీపీ కృపేశ్, మాజీ వైస్ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ భరత్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు చంటి, నర్సింహ, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్

సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

తుర్కయాంజాల్, ఫిబ్రవరి 23: గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ అని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఆదివారం ఇంజాపూర్ బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధి ఇంజాపూర్‌లోని బంజారా భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ అన్నారు. అనంతరం గిరిజనులు బోగ్ బండార్ కార్యక్రమం, ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర రోడ్లు అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, మాజీ కౌన్సిలర్లు కోశికె అయిలయ్య, కల్యాణ్‌నాయక్, సునీల్, నాయకులు ధన్‌రాజ్ గౌడ్, బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు శ్రీనూనాయక్, అధ్యక్షుడు కిషన్ సింగ్, ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్, కోశాధికారి రామలింగం, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజ్‌కుమార్, లాల్‌సింగ్, శ్రీను పాల్గొన్నారు.

రేపటి నుంచి రామేశ్వరానికి ప్రత్యేక బస్సులు

షాద్‌నగర్‌టౌన్, ఫిబ్రవరి 23: మహాశివరాత్రిని పురస్కరించుకుని షాద్‌నగర్ ఆర్టీసీ బస్టాండ్ నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు డీఎం ఉష ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25, 26, 27న బస్సులు నడుస్తాయన్నారు. ఆర్టీసీ ద్వారా సురక్షిత ప్రయాణం ఉంటుందన్నారు. భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేస్తున్న ఆర్టీసీ బస్సులను భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు వేములనర్వలో ఉచిత వైద్య శిబిరం

కేశంపేట, ఫిబ్రవరి 23: మండలంలోని వేములనర్వ గ్రామంలో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు మైత్రీ యువజన సంఘం అధ్యక్షుడు మనోహర్‌గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9:30గంటలకు జిమ్స్ ఆస్పత్రి వైద్యుల పర్యవేక్షణలో నిర్వహించే వైద్య శిబిరంలో బీపీ, షుగర్, కీళ్ల నొప్పుల వంటి సాధారణ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

చేవెళ్ల రూరల్, ఫిబ్రవరి 23 : గ్రామ ప్రజలు ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని యువ నాయకుడు డాక్టర్ మల్గారి వైభవ్‌రెడ్డి అన్నారు. ఆదివారం చేవెళ్ల మండల పరిధి ఊరెళ్ల గ్రామంలో టీఎక్స్ దవాఖాన సౌజన్యంతో డాక్టర్ వైభవ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో దాదాపు 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి బీపీ, షుగర్, ఈసీజీ, పల్మనరీ ఫంక్షన్ టెస్ట్, దంత పరీక్షలు, కంటి పరీక్షలు, కండ్ల అద్దాలు, ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ విజయలక్ష్మీరమణారెడ్డి, స్థానిక నేతలు అనంత్‌రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్నాళ్లో కంకర కష్టాలు..

కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో నత్తనడకన సాగుతున్న రోడ్ల పనులు

చోద్యం చూస్తున్న అధికారులు..

ఇబ్బందులెదుర్కొంటున్న ప్రయాణికులు

గ్రామాలకు వెళ్లే రోడ్ల వెంట కంకరపోసి వదిలేయటంతో ఇబ్బందులెదుర్కొంటున్న ప్రయాణికులు..

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 23 : కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం.. అధికారుల అలసత్వం కారణంగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం మండలాల్లో పలు గ్రామీణ ప్రాంతాలను కలుపుతూ ఉన్న రోడ్ల విస్తరణ, రీ బీటింగ్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. రోడ్డు నిర్మాణం పనుల కోసం కొన్ని నెలులగా రోడ్డుకిరువైపులా గోతులను తవ్వి, కంకర పోసి వదిలేశారు. దీంతో గ్రామీణ ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి వేళల్లో ప్రమాదాల బారిన పడుతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామీణ ప్రాంతాల రోడ్ల విస్తరణ పనుల కోసం ఎన్నికల ముందు కోట్లాది రూపాయల నిధులు కేటాయించింది. అనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు ఈ రోడ్డు పనులను ఏమాత్రం పట్టించుకోకపోవటంతో ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మారింది. గ్రామాలను కలుపుతూ ఉన్న రోడ్ల పనులను త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులు, ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోయినా పట్టించుకోవటం లేదని గ్రామీణ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా ఇబ్రహీంపట్నం మండలంలోని చర్లపటేల్‌గూడ నుంచి తుర్కగూడ మీదుగా కప్పాడు వరకు, ఎలిమినేడు నుంచి కప్పాడు మీదుగా తులేకలాన్ వరకు, రాయపోల్ నుంచి పోల్కంపల్లి, పోల్కంపల్లి నుంచి మాన్యగూడ మీదుగా రాయపోల్ వరకు ఉన్న రోడ్లు పెద్ద ఎత్తున గోతులు ఏర్పడి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే, తాళ్లగూడ గేటు నుంచి తాళ్లగూడ, చిత్తాపూర్ మీదుగా మంచాల వరకు, మంచాల నుంచి జాపాల్ వరకు, జాపాల్ నుంచి ఆగాపల్లి వరకు ఉన్న రోడ్లపై కంకరపోసి వదిలేశారు. ఈ కంకర రోడ్డుపై ప్రయాణం చేయాలంటూ ప్రయాణికులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రయాణికుల ఇబ్బందులు గుర్తించి అధికారులు వెంటనే రోడ్డు పనులు పూర్తి చేసేందుకు కృషిచేయాలని కోరుతున్నారు.

గత ప్రభుత్వంలో రోడ్ల విస్తరణకు పెద్దపీట

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో నియోజకవర్గంలో రోడ్ల విస్తరణ పనులు పెద్ద ఎత్తున పూరతయ్యాయి. నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక చొరవతో రోడ్ల విస్తరణ కోసం ప్రభుత్వం నుంచి కోట్లాది రూపాయలు విడుదల చేయించి పెద్ద ఎత్తున రోడ్లను విస్తరించారు. అలాగే, ఈ ప్రాంతంలో రోడ్ల విస్తరణతో పెద్ద ఎత్తున పరిశ్రమల ఏర్పాటుకు కూడా కృషిచేశారు. ఎన్నికల ముందు మిగిలిపోయిన రోడ్లకు రీబీటింగ్‌తో పాటు విస్తరణ పనులు చేపట్టేందుకు కోట్లాది రూపాయల నిధులు కేటాయించింది.

అధికారులు పట్టించుకోవట్లేదు..

గ్రామాలకు చేరుకునేందుకు ఉన్న ప్రధాన రోడ్ల వెంట కొన్ని నెలలుగా కంకరపోసి వదిలేశారు. కంకరపోసి వదిలేసిన రోడ్లపై ప్రయాణం చేయాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఈ విషయమై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకుపోయినా అధికారులు పట్టించుకోవటంలేదు. గత ప్రభుత్వం హయాంలో కేటాయించిన రోడ్ల పనులకు నిధులను వెచ్చించి వెంటనే రోడ్ల మరమ్మతు పనులు పూర్తిచేయాలి.

- బకున మల్లప్ప, జాపాల్

పనులు పూర్తి చేయాలి

గత ప్రభుత్వ హయాంలో రోడ్ల నిర్మాణ పనులకు కోట్లాది రూపాయల నిధులు కేటాయించింది. ఏ రోడ్డు మరమ్మతులు చేపట్టకుండా ప్రస్తుత కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు కాలం వెల్లదీస్తున్నారు. వెంటనేగ్రామాలను కలుపుతూ ఉన్న ప్రధాన రోడ్ల మరమ్మతులు పనులను వెంటనే చేపట్టాలి.

- అచ్చన శ్రీశైలం, రాయపోల్ మాజీ ఎంపీటీసీ

కేశంపేట మండలం లేమామిడిలో సాగు చేసిన మొక్కజొన్న పంట

మొక్కజొన్న సాగుకే ఆసక్తి

2800ఎకరాలకు విస్తరించినట్లు వ్యవసాయశాఖ అధికారుల వెల్లడి

యాసంగిలో తగ్గిన వరి..

నీటి సమస్యతో రైతుల నిరాసక్తి..

పంట మార్పిడితో అధిక దిగుబడి వస్తుందంటున్న అధికారులు

కేశంపేట, ఫిబ్రవరి 23: ప్రస్తుత యాసంగి సీజన్‌లో కేశంపేట మండలంలో మొక్కజొన్న పంట పెద్ద ఎత్తున సాగవుతున్నది. గతంలో మండల వ్యాప్తంగా కేవలం 400ఎకరాల్లో సాగైన మొక్కజొన్న ప్రస్తుత సీజన్‌లో ఏకంగా 2800ఎకరాలకు విస్తరించినట్లు వ్యవసాయశాఖ అధికారులు గణాంకాలు చెబుతున్నాయి. గత వర్షాకాలంలో 4000ఎకరాల్లో వరిని సాగు చేసిన రైతులు 2,200ఎకరాలకు పరిమితమైనట్లు అధికారులు చెబుతున్నారు. వరి ఒక్కసారిగా సగానికి పడిపోవడాకి ప్రధాన కారణం నీటి సమస్య అని చెప్పవచ్చు. వర్షాకాలంలో అయితే బోరుబావుల్లోకి నీరు వచ్చే అవకాశాలు ఉండడంతో పాడుబడిన బోరుగుంతలకు సైతం రైతులు మరమ్మతులు చేసి వరిని సాగు చేయడంతో ప్రతియేటా సాగు భారీగా పెరుగుతుంది. ఇక వేసవిలో బోరుబావులు ఎండిపోయే అవకావాలు ఉండడంతో వరికి బదులుగా ప్రత్యామ్నాయంగా మొక్కజొన్నను సాగు చేసినట్లు తెలుస్తోంది. దానికితోడు శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారులు రైతులు తప్పనిసరిగా పంటలను మార్పిడి చేయాలని సూచిస్తున్నారు. పంటలను మార్పిడి చేయడంవల్ల సాగు చేసే పంట అధికంగా దిగుబడి సాధిస్తుందని రైతులను చైతన్య పరుస్తుండడం సైతం పంటల మార్పిడికి కారణంగా చెప్పవచ్చు. ఏది ఏమైనా 400ఎకరాల్లో సాగైన మొక్కజొన్న ప్రస్తుత యాసంగిలో 2800ఎకరాలకు విస్తరించిందంటేనే ఏ స్థాయిలో పంటను సాగు చేస్తున్నారన్నది స్పష్టంగా అర్థమవుతుందని చెప్పవచ్చు.

సేంద్రియ ఎరువు తయారీపై శిక్షణ

కంపోస్టింగ్ ఎరువు తయారీ విధానాన్ని పరిశీలిస్తున్న అధికారులు

తుర్కయాంజాల్, ఫిబ్రవరి 23 : తడి, పొడి, హానికర చెత్తను వేరుచేసి సేంద్రియ ఎరువు తయారీ విధానంపై మున్సిపాలిటీల అధికారులకు ఒక్కరోజు శిక్షణ నిర్వహించారు. శనివారం సీడీఎంఏ ఆదేశాల మేరకు పురపాలక జాయింట్ డైరెక్టర్ సంధ్య, సీడీవో హేమలత పర్యవేక్షణలో మున్సిపాలిటీ పరిధి బ్రహ్మణపల్లి డీఆర్‌సీ సెంటర్‌లో 11 మున్సిపాలిటీల కమిషనర్లు, పారిశుధ్య ఇన్‌స్పెక్టర్లు, ఇంజినీర్లలకు కంపోస్టింగ్, ఘన వ్యర్థాల నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. చెత్తతో సంపదను సృష్టించడంతో పాటుగా తక్కువ ఖర్చుతో చెత్తను ప్రాసెసింగ్ చేయొచ్చని తెలిపారు. పారిశుధ్య నిర్వహణలో ఆధునిక పద్ధతులను వినియోగించాలని పురపాలక జాయింట్ డైరెక్టర్ సంధ్య పేర్కొన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛ సర్వేక్షణ్ కో ఆర్డినేటర్ ఫణి, 11 మున్సిపాలిటీల కమిషనర్లు, అధికారులు పాల్గొన్నారు.

చౌదరిగూడ మండలంలోని గుంజల్‌పహాడ్‌లోని అభయాంజనేయస్వామి, శ్రీ సీతారామచంద్రస్వామి విగ్రహాల ప్రతిష్ఠాపనలో మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ పాల్గొని పూజలు చేశారు.

- కొందుర్గు, ఫిబ్రవరి 23

ఎస్ఎఫ్ఐ మహాసభలు వాయిదా

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ప్రణయ్

షాద్‌నగర్‌టౌన్, ఫిబ్రవరి 23: ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నేటి నుంచి రెండ్రోజుల పాటు నిర్వహించనున్న జిల్లా మహాసభలను వాయిదా వేయడం జరిగిందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ప్రయణ్ తెలిపారు. పట్టణంలోని కార్యాలయంలో ఆదివారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. విద్యార్థుల పరీక్షల నేపథ్యంలో ఈ మహాసభలను వాయిదా వేసినట్లు తెలిపారు. అదే విధంగా విద్యార్థుల సమస్యల పరిష్కరించడంలో ఎస్ఎఫ్ఐ ఎప్పుడు ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్, ఆర్తిక్, శివశంకర్, అశోక్, వినయ్, విశాల్, ముకేశ్, వేణు పాల్గొన్నారు.

ఆత్మ రక్షణకు కరాటే..

బడంగ్‌పేట్, ఫిబ్రవరి 23:మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న సిరిపురం యాదయ్య గ్రౌండ్‌లో సెల్ఫ్ డిఫెన్స్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన చిన్నారులకు గ్రేడింగ్ బెల్టులను చిగురింత పారిజాత నరసింహారెడ్డి ఆదివారం అందజేశారు. ఆత్మరక్షణకు ప్రతి ఒక్కరూ కరాటే నేర్చుకోవాలని ఆమె సూచించారు. తనకు తాను రక్షించుకోవడానికి ఈ విద్యలను తప్పనిసరిగా నేర్చుకోవాలన్నారు. నాయకులు బాలకృష్ణ, మార్షల్ ఆర్ట్స్ గ్రాండ్ మాస్టర్ జి.నాగరాజు, మాస్టర్స్ పాల్గొన్నారు.

యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

మొయినాబాద్, ఫిబ్రవరి 23: యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని మేడిపల్లి మాజీ సర్పంచ్ కామని నవీన్‌కుమార్ అన్నారు. మొయినాబాద్ మండల పరిధిలోని మేడిపల్లి గ్రామంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఎంపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. స్పాన్సర్ కొత్తపల్లి సురేందర్ నిర్వహించిన టోర్నమెంట్‌లో శ్రీనివాస్ జట్టు విజేతగా నిలువగా , మహేశ్ జట్టు రన్నర్‌గా నిలిచింది. బహుమతులు ప్రదానోత్సవ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నవీన్ మాట్లాడుతూ యువత క్రీడలకు కేటాయించాలని చెప్పారు. క్రీడల్లో కాణించి ఉజ్వల భవిషత్తును నిర్మించుకోవచ్చని అన్నారు. గ్రామంలో నిర్వహించే ఇలాంటి టోర్నమెంటులను సద్వినియోగం చేసుకుని ప్రతిభను కనబర్చాలని చెప్పారు. ఈ సందర్భంగా విజేతలకు ట్రోఫీతో పాటు నగదు బహుమతిని అందించారు. కార్యక్రమంలో క్రీడాకారులు , యువకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఐబీఎస్ 2003 బ్యాచ్ రీయూనియన్

చేవెళ్ల రూరల్, ఫిబ్రవరి 23 : ఇక్వాయ్ బిజినెస్ స్కూల్ (ఐబీఎస్) 2003 బ్యాచ్ పూర్వ విద్యార్థుల రీయూనియన్ ఘనంగా నిర్వహించారు. శంకర్‌పల్లి మండలం దొంతాన్‌పల్లిలోని క్యాంపస్‌లో ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి దేశంలోని పలు రాష్ట్రాలతో పాటు యూఎస్, యూకే, సింగపూర్, దుబాయ్ లాంటి దేశాల నుంచి సుమారు 100 మంది పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. ఐఎఫ్‌హెచ్ ఈ రిజిస్ట్రార్ డా.ఎస్. విజయలక్ష్మి, ఏఆర్‌సీ డీన్ ప్రొఫెసర్ జీకే. శ్రీకాంత్, ఐబీఎస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కేఎస్. వేణుగోపాల్ రావు, డీన్ ప్రొఫెసర్ డి. సతీష్, ఎస్ఎస్‌డీఐ ఎఫ్ఎఫ్‌హెచ్‌ఈ జాయింట్ రిజిస్ట్రార్ మధుసూదన్ రావు గౌరవ అతిథులుగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు డా.మహేష్ భాంగ్రియా రాసిన కార్పొరేట్ అడ్వెంచర్స్, ఉపేంద్ర ధర్మాధికారి రూపొందించిన ప్రిన్సెస్ ఐన్ బ్లాక్ అనే పుస్తకాలను ఆవిష్కరిచారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. పూర్వ విద్యార్థులు ప్రస్తుతం గ్లోబల్ కార్పొరేట్ కంపెనీల్లో కీలక పదవుల్లో ఉన్నారని, ఎంతోమంది సక్సెస్‌ఫుల్ ఎంట్రప్రెన్యూర్లుగా ఎదగడం సంతోషంగా ఉందన్నారు. ఇది ఐబీఎస్‌తోనే సాధ్యం అయ్యిందని పేర్కొన్నారు. 2003 బ్యాచ్ విజయగాథను ప్రతిబింబించిన ఈ రీయూనియన్ విశ్వవిద్యాలయానికి ప్రేరణ కలిగించిందని చెప్పారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, వక్తలు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు, పూర్వవిద్యార్థులు

సజావుగా గురుకుల ప్రవేశ పరీక్ష

మొయినాబాద్‌లోని చిలుకూరు గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రానికి హాజరైన విద్యార్థులు

మొయినాబాద్, ఫిబ్రవరి 23 : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల, బాలుర పాఠశాలలో 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు నిర్వహించిన ప్రవేశ పరీక్షకు విశేష స్పందన లభించింది. ప్రవేశాలు పొందడం కోసం పెద్ద ఎత్తున దరఖాస్తులు చేసుకోవడంతో 90 శాతం విద్యార్థులు ప్రవేశ పరీక్షకు హాజరయ్యారు. మొయినాబాద్ మండల పరిధిలోని చిలుకూరు గ్రామంలోని గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో 5వ తరగతికి సంబంధించిన విద్యార్థులు 452 మందికి 410 మంది విద్యార్థులు పరీక్షకు హజరుకాగా, 6వ తరగతికి సంబంధించి 154 మందికి గానూ 134 మంది, 7వ తరగతికి సంబంధించి 95 మందికి 88మంది, 8వ తరగతికి సంబంధించి 29 మందికి గాను 27 మంది 9వ తరగతికి సంబంధించి 37 మందికి గాను 37 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. తోలుకట్టా గ్రామంలోని చేవెళ్ల గురుకుల బాలికల పాఠశాలలో 577 మంది విద్యార్థులకు 565 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. చేవెళ్ల గురుకుల బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 98 శాతం విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 5వ తరగతికి సంబంధించి 297 మంది, 6వ తరగతి 70 మంది, 7వ తరగతి 74మంది, 8వ తరగతి 73 మంది, 9వ తరగతి 53 మంది బాలబాలికలు పరీక్ష రాశారు. చీఫ్ సూపరిటెండెంట్‌గా మాలతీ పరీక్ష విధానాన్ని పర్యవేక్షించారు. తోలుకట్టాలోని బంట్వారం గురుకుల బాలికల పాఠశాలలో 676 మందికి గాను 657 మంది పరీక్ష రాశారు. మొయినాబాద్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని శంకర్‌పల్లి బాలికల గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో 5తరగతి నుంచి 9వ తరగతి వరకు ప్రవేశం పొందే విద్యార్థులు 217 గాను 206 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఉదయం 11 నుంచి 1 గంట వరకు నిర్వహించిన పరీక్షకు విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు ఉదయం 9.30 గంటల వరకు చేరుకున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసుల బందోబస్తు నిర్వహించారు.

కొందుర్గు : మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో నిర్వహించిన ప్రవేశపరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు ప్రిన్సిపాల్ కుర్షిద్ తెలిపారు. 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు 5వ తరగతిలో ప్రవేశం పొందేందుకు రాత పరీక్షను రాశారని, అదేవిధంగా 7, 8, 9వ తరగతుల్లో ఖాళీలకోసం నిర్వహించిన ప్రవేశ పరీక్షకు విద్యార్థులు హాజరయ్యారు.

ఛత్రపతి శివాజీ విగ్రహం ఆవిష్కరణ

ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

నందిగామ, ఫిబ్రవరి 23: నందిగామ మండల పరిధిలోని చర్లఅంతిరెడ్డిగూడ గ్రామంలో గ్రామస్తులు ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహాన్ని ఆదివారం షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. ఛత్రపతి శివాజీ మహరాజ్ దేశం కోసం చేసి సేవలను కొనియాడారు. ప్రతి ఒక్కరూ ఛత్రపతి శివాజీ మహరాజ్‌ను ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

కడ్తాల్, ఫిబ్రవరి 23: గ్రామంలో ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరినీ ఆదుకుంటానని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. మండల కేంద్రానికి చెందిన తట్టపల్లి కిష్టమ్మ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం ఉదయం మరణించింది. విషయం తెలుసుకున్న లక్ష్మీనర్సింహారెడ్డి స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి కిష్టమ్మ మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.4,500 ఆర్థిక సాయం అందజేశారు. పరామర్శించిన వారిలో మాజీ సర్పంచ్ చెన్నయ్య, నాయకులు కాశయ్య, జంగయ్య, సురేశ్ పాల్గొన్నారు.

ఘనంగా ఆత్మీయ సమ్మేళనం

విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

షాద్‌నగర్‌టౌన్, ఫిబ్రవరి 23: పట్టణంలోని పద్మావతికాలనీలోని జిల్లా పరిషత్ కుంట ఉన్నత పాఠశాలలో 2007-08విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు అప్పటి తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకొని ఆత్మీయంగా పలుకరించుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు రసూల్, జగదీశ్‌రెడ్డి, రాజు, వేదప్రకాశ్, వెంకటయ్య, వరదారెడ్డి, నసీమ్, శ్రీలత, సుప్రియ, స్వరూప మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదిగినప్పుడే వారి తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులకు మంచి గుర్తింపు ఉంటుందన్నారు. తమకు విద్య నేర్పిన ఉపాధ్యాయులను గుర్తించుకుని ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ఆహ్వానించడం పట్ల ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు. అనంతరం ఉపాధ్యాయులను శాలువలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. పాఠశాలలో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి సహకరించిన పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భాగ్యమ్మకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రాజేందర్, అనిల్, ప్రదీప్, జబ్బార్, మురళీ, వినోద్, మణికంఠ, శ్రీను, రాజేష్, ప్రేమ్, మహేష్, అనిల్, శ్రీలత, మంగమ్మ, జమాల్, యాదగిరి పాల్గొన్నారు.

భూ బాధితులకు న్యాయం చేయాలి

చేవెళ్ల రూరల్, ఫిబ్రవరి 23 : శంకర్‌పల్లి మండలం కొండకల్ తండా శివారులోని లంబాడ గిరిజన ప్రజలు తమకు సంబంధించిన 80 ఎకరాల బిలాదాఖాల భూముల ఆక్రమణలపై చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 44వ రోజుకు చేరాయి. ఆదివారం దీక్షలో పాల్గొన్న భూ బాధితులు మాట్లాడుతూ.. తమకు సంబంధించిన 80 ఎకరాల బిలాదాఖాల భూములను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకొని, అవి తమ